సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025

శరణు.. శరణు దేవీ!



అమ్మవారి ఆగమనానికి అంతా సిద్ధమైంది. దేవీ శరన్నవరాత్రోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానుండగా జిల్లా వ్యాప్తంగా మండపాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. 10లో▸



సమస్యల్లో ఆలయం! 11లో▸

నవంబర్ 2నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించాల్సిన జైనథ్ ప్రాచీన లక్ష్మీనారాయణస్వామి గుడి సమస్యలకు నిలయమైంది. ఆదాయమున్నా ఆదరణకు నోచుకోవడంలేదు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

వసూళ్లపై ఇంటెలిజెన్స్ ఆరా



చంటి ట్వీట్ చేసిన సాక్షి కథనం

ఆదిలాబాద్‌టౌన్: 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన 'అంగన్‌వాడీల నుంచి అక్రమ వసూళ్లు' కథనానికి ఇంటెలిజెన్స్ అధికారులు స్పందించారు. డబ్బులు వసూలు చేసిన వ్యక్తి వివరాలపై ఆరా తీశారు. అలాగే, ఐసీడీఎస్ పీడీ, అధికారులు ఇటీవల ఆయాల నుంచి టీచర్లుగా ప్రమోషన్ పొందిన వారికి ఫోన్లు చేసి ఎవరైన డబ్బులు అడిగారా.. ఎవరికైనా డబ్బులు ఇచ్చారా.. అని అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు చంటి పసుల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, కలెక్టర్ రాజర్షి షాతో పాటు పలువురికి 'సాక్షి' కథనాన్ని ట్వీట్ చేశారు. అంగన్‌వాడీల నుంచి అక్రమంగా వసూలు చేసిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

'ఐఏటీ'లో గిరిజన విద్యార్థినికి 729వ ర్యాంక్



తల్లిదండ్రులతో రాథోడ్ కీర్తి

ఉట్నూర్ రూరల్: మండలంలోని గంగన్నపేట్ గ్రామానికి చెందిన రాథోడ్ సరోజ–కిశోర్ దంపతుల కూతురు కీర్తి జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఏటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి 729 ర్యాంక్ సాధించింది. తద్వారా బీఎస్ఎంఎస్ ఐదేళ్ల కోర్సులో ఒడిసా రాష్ట్రంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) బరంపూర్ కళాశాలలో సీటు పొందింది. కీర్తి తల్లి సరోజ ఉపాధ్యాయురాలు కాగా, తండ్రి కిశోర్ నార్నూర్‌లో వ్యవసాయం చేస్తున్నాడు. కీర్తి ఎస్సెస్సీ వరకు ఉట్నూర్‌లో, ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. కీర్తిని స్థానికులు అభినందిస్తున్నారు.

ముస్లింల నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆదిలాబాద్‌టౌన్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో 'ఐలవ్‌యూ మహ్మద్' అనే బోర్డు ఏర్పాటు చేసినందుకు ముస్లిం యువకులపై కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలో ముస్లింలు నిరసన తెలిపారు. శాంతియుత ర్యాలీ నిర్వహించారు. 'ఐలవ్‌యూ మహ్మద్' పోస్టర్లను ప్రదర్శిస్తూ యువకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సాజిద్ ఖాన్, అర్బాత్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ లెక్చరర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మంజుల

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ తిరుకోవెల మంజులకు డాక్టరేట్ లభించింది. ఆమె శాతవాహన విశ్వవిద్యాలయంలో 'సింథసిస్ ఆఫ్ పైరన్ అండ్ పైపిరిడిన్ డెరివేటివ్స్ యూసింగ్ నావెల్ మెథలాడజీ' అనే అంశంపై పరిశోధన చేశారు. శాతవాహన విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ జయంతి పర్యవేక్షణకు గాను డాక్టరేట్ పట్టా అందజేసినట్లు ఆమె వివరించారు. పరిశోధన సమయంలో అంతర్జాతీయ స్థాయిలో పలు పత్రాలు అందజేశారు. తన కుటుంబ సభ్యుల సహకారంతో డాక్టరేట్ లభించిందని మంజుల తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ సంగీత, లెక్చరర్లు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

టెట్ గుబులు

- జిల్లాలో అర్హత ఉన్నది 791మందికే
- లేని 1,845 మంది టీచర్లలో టెన్షన్
- ఆందోళన రేకెత్తిస్తున్న 'సుప్రీం' తీర్పు
- సీనియర్లకు నిబంధన వద్దని విజ్ఞప్తి

జిల్లాలోని పాఠశాలల సమాచారం	
డీఈవో పరిధి మొత్తం స్కూళ్లు	739
ప్రాథమిక పాఠశాలలు	500
ప్రాథమికోన్నత పాఠశాలలు	119
ఉన్నత పాఠశాలలు	120

ఉపాధ్యాయుల వివరాలు	
మొత్తం ఉపాధ్యాయులు	2,636
టెట్ అర్హత ఉన్నవారు	791
టెట్ అర్హత లేని వారు	1,845

కోర్టు తీర్పు రివ్యూ చేయాలని ఎస్‌టీఎఫ్‌ఐ తరఫున ఇటీవల పిటిషన్ వేసిన ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు



ఆదిలాబాద్‌టౌన్: సుప్రీం కోర్టు 'టెట్' (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పై ఇచ్చిన తీర్పు ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో గుబులు రేపుతోంది. ఉపాధ్యాయ కొలువులో ఉండాలన్నా.. ప్రమోషన్లు పొందాలన్నా టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని నిబంధన విధించింది. రెండేళ్లలోపు టెట్ పాస్ కావాలని, లేదంటే ఉద్యోగం వదులుకోవాలని తీర్పు వెలువరించింది. దీంతో సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు హైరానా పడుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. కాగా, ఉద్యోగ విరమణకు ఐదేళ్లున్నవారికి మాత్రం సుప్రీం కోర్టు మినహాయింపు ఇచ్చింది. గతంలో టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు టెట్ పాసైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే ఎట్టకేలకు ఇటీవల కోర్టు తీర్పునివ్వడంతో టెట్ అర్హత ఉన్న ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. సీనియర్ ఉపాధ్యాయుల్లో మాత్రం భయాందోళనలు రేకెత్తుతున్నాయి.

33శాతం మందికే అర్హత

జిల్లాలో డీఈవో పరిధిలో 739 పాఠశాలలున్నాయి. వీటిలో 500 ప్రాథమిక పాఠశాలలు, 119 ప్రాథమికోన్నత, 120 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 65వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 2,636 మంది టీచర్లుండగా.. ఇందులో 33శాతం అంటే 791మందికే టెట్ అర్హత ఉంది. మిగతా 1,845 మందికి టెట్ అర్హత లేదు. 2010 ఏప్రిల్‌లో విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చింది. 2010 ఆగస్టు 21నుంచి ఈ చట్టాన్ని అమలు చేశారు. 2012, 2017, 2024 ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ అమలు చేశారు. వీరితో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులు ఇటీవల టెట్ రాసి ఉత్తీర్ణులయ్యారు.

మినహాయింపు కోరుతున్న సీనియర్లు

సీనియర్ ఉపాధ్యాయులు ఇప్పుడు టెట్ రాయలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. తెలుగు పండితులకు సాంఘిక శాస్త్రానికి సంబంధించి సంబంధం లేని సబ్జెక్ట్ గణితం, ఫిజిక్స్ టెట్‌లో సబ్జెక్టులు ఉండడంతో వారు అర్హత సాధించడం కష్టతరమే అంటున్నారు. రెగ్యులర్ విద్యార్థులు టెట్ పరీక్షల్లో 15 నుంచి 20 శాతం వరకే అర్హత సాధిస్తుండగా, ఏళ్ల క్రితం విధుల్లో చేరిన వారు నిబంధనలు సడలించాలని కోరుతున్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రెండేళ్లలో టెట్ అర్హత సాధించకపోతే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి ఉద్యోగ విరమణ చేయించడమే. అయితే ఏడాదిలో రెండుసార్లు టెట్ నిర్వహించాల్సి ఉండగా, ప్రభుత్వం అలా నిర్వహించడం లేదు. రెండేళ్లలో మూడేసార్లు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యాహక్కు చట్టం కంటే ముందే ఉపాధ్యాయ వృత్తిలో చేరినవారికి టెట్ మినహాయింపు ఇవ్వాలని, ప్రమోషన్లు పొందేవారికే టెట్ అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు. అయితే సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, ప్రధానోపాధ్యాయులు టెట్ రాయాల్సి ఉంది. ఈ నిబంధన వ్యాయామ ఉపాధ్యాయులకు లేకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

కోర్టులో పిటిషన్ వేశాం



టెట్ విషయంలో సుప్రీం కోర్టులో పిటిషన్ వేశాం. ఏదైన చట్టం అమలైన రోజు నుంచి నిబంధనలు వర్తించాలి. 2010 కంటే ముందు ఉపాధ్యాయులకు టెట్ అర్హత నుంచి మినహాయింపు ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రీపిటిషన్ వేయాలి. ప్రమోషన్లు పొందే ఉపాధ్యాయులకు మాత్రం టెట్ అర్హత పెట్టడం సరైందే. కోర్టు తీర్పుతో చాలామంది ఉపాధ్యాయులు భయాందోళనలో ఉన్నారు.

– వెంకట్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మినహాయింపు ఇవ్వాలి



మానవతాదృక్పథంతో ఆలోచించి టెట్ రాకముందు వృత్తిలో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి. ఈ విషయంలో గందరగోళం నెలకొని మానసిక వేదనకు గురవుతున్నారు. ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చినట్లుగానే విద్యాహక్కు చట్టం అమలుకంటే ముందు విధుల్లో చేరిన వారికీ మినహాయింపు ఇవ్వాలి.

– కొమ్ము కృష్ణకుమార్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఆశలు ఆవిరి!



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు జాదవ్ సూర్యకాంత్. ఇచ్చోడ మండలం దాబా (కే)లో ఐదెకరాల్లో పత్తి సాగు చేస్తున్నాడు. నెల రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తిలో ఎదుగుదల నిలిచిపోయింది. చేనులో వర్షపు నీరు నిల్వ ఉండటంతో మొక్కల రంగు కూడా మారింది. 120 రోజులైనా కాత, పూత రాలేదు. ఇప్పటివరకు మూడుసార్లు ఎరువులు వేశాడు. నాలుగుసార్లు క్రిమిసంహారకాలు పిచికారీ చేశాడు. అయినా పంట ఆశాజనకంగా లేదు. పెట్టుబడి ఖర్చులు కూడా వస్తయో.. రావోనని ఆందోళన చెందుతున్నాడు. ఇది అతని ఒక్కని పరిస్థితే కాదు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది పత్తి సాగు చేస్తున్న రైతులందరి పరిస్థితి దాదాపు ఇలాగే ఉంది.

ఇచ్చోడ: పుడమి తల్లిని నమ్ముకున్న రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఒడిదుడుకులతో ప్రారంభమైన ఖరీఫ్ సాగు ముందుకు సాగడంలేదు. పెట్టుబడికి చేసిన అప్పులు తలకు మించిన భారంగా మారి అన్నదాతలపై ఆర్థికభారం మరింత పెరగనుంది. జిల్లాలో తీవ్ర అతివృష్టితో పత్తి పంటలో ఎదుగుదల నిలిచిపోయింది. నెలన్నర నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పూత, కాత ఆశించిన స్థాయిలో రాలేదు. గత జూన్‌లో విత్తనాలు వేసే ముందు వర్షాలు కొంత ఆశించిన స్థాయిలో ఉన్నా మొక్కలు పెరిగే సమయంలో ఆగస్టు నుంచి వర్షాలు కురవడం ప్రారంభమైంది. ఒక్కరోజూ విరామం లేకుండా 50 రోజులుగా కురుస్తూనే ఉండగా పంట ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయింది. గతేడాది ఇప్పటివరకు చెట్టుకు 30 నుంచి 40 వరకు కాయలు కాశాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 10 కాయలు కూడా లేక దిగుబడుపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం

ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా వ్యాప్తంగా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. జూన్, జూలై వరకు సాధారణానికి పరిమితమై, ఆగస్టు నుంచి సెప్టెంబర్ 12వరకు 1215.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 33శాతం అధికం. ఇచ్చోడ, సిరికొండ, బజార్‌హత్నూర్, తలమడుగు, మావల, ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, గుడిహత్నూర్, బేల, జైనథ్, సాత్నాల, నేరడిగొండ మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. 12మండలాల్లో సాధారణం కంటే 47 నుంచి 67 శాతం అధికంగా వర్షం కురిసింది.



ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్‌లో ఎదుగుదల నిలిచిన పత్తి

పెరిగిన పెట్టుబడులు

పత్తి విత్తుకున్న నుంచి 180రోజులలోపు పంట గడువు ముగుస్తుంది. విత్తుకున్న నాటి నుంచి 120 రోజుల వరకు ఎదుగుదల, కాత, పూత దశకు చేరుకుంటుంది. 120 రోజుల పాటు పత్తిని ఏపుగా పెంచడంతో పాటు కాత, పూత కోసం రైతులు ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేస్తుంటారు. దాదాపు నాలుగు నుంచి ఐదుసార్లు ఎరువులు వేస్తారు. కానీ, ఈ ఏడాది గత 50రోజులుగా నిరంతరం కురుస్తున్న వర్షాలతో ఎరువులు, పురుగు మందుల వాడకం కూడా పెరిగిపోయింది. దీంతో ఏడాది పత్తి పంట సాగుకు పెట్టుబడులు పెరిగిపోగా దిగుబడులు మాత్రం ఘననీయంగా తగ్గిపోయే అవకాశముండగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడులు తగ్గవచ్చు

నెలరోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున పత్తి దిగుబడులపై ప్రభావం పడనుంది. నిత్యం వాన కురుస్తుండడతో పంట ఎదుగుదల నిలిచిపోయింది. ఆశించిన స్థాయిలో కాత, పూత రాలేదు. వర్షాలు తగ్గుముఖం పడితే కొంత కాత, పూత పెరగనుంది. అయినా ఈసారి దిగుబడులు తగ్గే అవకాశముంది.

– రాజశేఖర్, ఏరువాక సీనియర్ శాస్త్రవేత్త, ఆదిలాబాద్

వామ్మో పెద్దపులి!

- రెండు అడవుల్లో సంచారం
- ఇప్పటికే ఓ ఎద్దు హతం
- ట్రాప్ కెమెరాలు ఏర్పాటు



పులి పాదముద్రలు



పులి దాడిలో మృతి చెందిన ఎద్దు కళేబరం

బోథ్: సొనాల మండలంలోని ఘన్‌పూర్, వజ్జర్ అడవుల్లో పెద్దపులి సంచరిస్తోంది. ఈ నెల 19న దేవుల్‌నాయక్ తండా గ్రామానికి చెందిన రాథోడ్ గోవింద్ ఎద్దును హతమార్చింది. ప్రస్తుతం ఈ అడవుల్లోనే సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. పెద్దపులిని ట్రాప్ చేసేందుకు అటవీశాఖ అధికారులు కెమెరాలు అమర్చారు. ఎద్దును పులి హతమార్చిన ప్రదేశానికి ఎవరూ వెళ్లవద్దని అటవీశాఖ అధికారి ప్రణయ్ సూచించారు. అయితే ఆదివాసీ గ్రామాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాగా, తిప్పేశ్వర్ అడవుల్లో నుంచి ఘన్‌పూర్ మీదుగా తెలంగాణకు పెద్దపులి వచ్చి వెళ్తోంది. ఈ ఏడాది జూన్‌లో బోథ్ మండలంలోని నారాయణపూర్, రఘునాథ్‌పూర్ ప్రాంతాల్లో సంచరించింది. గతేడాది నవంబర్‌లో వజ్జర్, చింతగూడ, మర్లపెల్లి, నిగిని ప్రాంతాల్లో తిరిగింది. మొత్తంగా ఏడాదిలో మూడుసార్లు పెద్దపులి బోథ్, సొనాల మండలాలకు వచ్చింది. అటవీ విస్తీర్ణం పెరగడంతో పెద్దపులికి ఆవాసానికి అనుకూలంగా ఉండగా తరచూ వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లవద్దని అధికారులు అటవీ సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

రివర్ రాఫ్టింగ్ కేంద్రంగా 'పొచ్చెర'!

- ఇటీవలి కార్యక్రమం సక్సెస్
- నేడు డీటీసీపీ బృందం రాక
- అనుమతులు వస్తే అభివృద్ధి



జలపాతం నుంచి కుప్టి వరకు రివర్ రాఫ్టింగ్ చేస్తున్న నిర్వాహకులు (ఫైల్)

బోథ్: పర్యాటక రంగంలో కొత్త అధ్యయనానికి నాంది పలుకుతూ బోథ్ మండలంలోని సుందరమైన పొచ్చెర జలపాతం ఇప్పుడు రివర్ రాఫ్టింగ్ కేంద్రంగా మారనుంది. తాజాగా ఈ జలపాతం వద్ద ఇటీవల కోయినా అడ్వెంచర్ టీమ్ విజయవంతంగా నిర్వహించిన ట్రయల్ దీనికి మరింత బలం చేకూర్చింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే నదుల్లో రివర్ రాఫ్టింగ్ నిర్వహిస్తారు. పర్యాటకులు, సాహస క్రీడల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గాలితో కూడిన పడవల్లో హెల్మెట్‌లు, ప్రత్యేక జాకెట్‌లు ధరించి దీనిని చేస్తుంటారు. అయితే మన దేశంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఇప్పటికే అనేకచోట్ల రాఫ్టింగ్‌కు అనుమతులిచ్చారు. దీంతో అక్కడ పర్యాటక రంగాలు అభివృద్ధిలో ఉన్నాయి. పొచ్చెర జలపాతం దిగువ నుంచి పారుతున్న నీటిలో సాహసోపేతంగా మొదటగా ఆరు కిలోమీటర్ల మేర కుప్టి వరకు రాఫ్టింగ్ నిర్వహించారు. ఈ ట్రయల్ రన్ విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు. జలపాతం పరిసరాల్లోని ప్రవాహాలు ఇందుకు ఎంతగానో అనుకూలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రెండు వైపులా ఎత్తైన కొండ ప్రాంతం, మధ్యలో వాగు ప్రవాహంతో ఎంతో ఆకట్టుకునేలా ఉందని వారు తెలిపారు. పొచ్చెర జలపాతాన్ని పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేసేందుకు, ప్రత్యేకించి సాహస క్రీడాప్రియులను ఆకర్షించేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుంది.

నేడు అధికారుల బృందం రాక

జిల్లా పర్యాటక ప్రోత్సాహక మండలి (డీటీపీసీ) చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ రాజర్షి షాతో పాటు పలువురు అధికారుల బృందం సోమవారం పొచ్చెర జలపాతాన్ని సందర్శించనున్నారు. పొచ్చెరలో పర్యాటక ప్రాంతాలను పర్యవేక్షించిన అనంతరం జలపాతం కింది భాగం నుంచి కుప్టి వరకు రివర్ రాఫ్టింగ్‌కు గల అవకాశాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. రాఫ్టింగ్‌కు అవసరమైన భద్రత ప్రమాణాలు, వసతులు, ఇతర అంశాలపై ఈ బృందం ఒక నివేదిక తయారు చేయనుంది.

అనుమతులొస్తే పర్యాటకానికి ఊతం

పొచ్చెర జలపాతం వద్ద రివర్ రాఫ్టింగ్‌కు డీటీపీసీ నుంచి అనుమతులు లభిస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందే ఆస్కారముంది. దీంతో త్వరలోనే పొచ్చెర జలపాతం అధికారికంగా ఒక రివర్ రాఫ్టింగ్ జోన్‌గా ప్రకటించబడే అవకాశముంది. అనుమతి లభిస్తే ఈ ప్రాంత పర్యాటకానికి మరింత ఊతమివ్వడమే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేస్తుందని అధికారులు భావిస్తున్నారు. పొచ్చెర జలపాతం ఇకపై చూడదగిన ప్రదేశమే కాకుండా, సాహస క్రీడలకు అనువైన ప్రదేశంగానూ ప్రసిద్ధి చెందవచ్చని తెలిపారు. రివర్ రాఫ్టింగ్ వర్షాకాలం చివరలో, చలికాలంలో నిర్వహించే అవకాశమున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అనుమతులొస్తే బాగుండు



పొచ్చెర జలపాతం వద్ద కోయినా అడ్వెంచర్ టీమ్ సభ్యులు రివర్ రాఫ్టింగ్ నిర్వహించారు. దిగువ జలపాతం నుంచి రాఫ్టింగ్ అనుకూలంగా ఉందని తెలిపారు. అనుమతులు వస్తే జలపాతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. తప్పకుండా అనుమతులు వస్తాయని ఆశిస్తున్నాం.

– ప్రణయ్, ఎఫ్ఆర్వో, బోథ్

రివర్ రాఫ్టింగ్ బాగుంది



మొదటిసారిగా అడ్వెంచర్ బృందం సభ్యులతో కలిసి రివర్ రాఫ్టింగ్‌లో పాల్గొన్నాను. పొచ్చెర జలపాతం దిగువ భాగం నుంచి కుప్టి వరకు దాదాపు ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లాం. ఆద్యంతం అడ్వెంచర్‌గా, థ్రిల్‌గా ఫీలయ్యాం. రివర్ రాఫ్టింగ్‌కు అనుమతులిస్తే పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది.

– వెండి పృథ్వి, రివర్ రాఫ్టింగ్‌లో పాల్గొన్న యువకుడు

కలెక్టరేట్‌లో లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఆదివారం కలెక్టరేట్‌లోని బాపూజీ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి కలెక్టర్ రాజర్షి షా పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర గురించి వివరించారు. బాపూజీ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ.. స్వరాష్ట్రం కోసం బాపూజీ పదవులను కూడా వదులుకున్నారని గుర్తు చేశారు. అలాగే, పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పద్మశాలీ సంఘం నాయకులు మంచికట్ల ఆశమ్మ, బేత రమేశ్, జిట్ట రమేశ్, బొమ్మకంటి రమేశ్, దాసరి రమేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు పాల్గొన్నారు.

'హిందీని విశ్వవ్యాప్తం చేద్దాం'

ఆదిలాబాద్‌రూరల్: హిందీని విశ్వవ్యాప్తం చేసి రాజభాష గౌరవాన్ని పెంచాలని హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 16న జిల్లాస్థాయి హిందీ దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. హిందీ భాషను విశ్వవ్యాప్తం చేయడానికి జిల్లాలోని హిందీ ఉపాధ్యాయులు విశేషంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో హిందీ భాష సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ, ఉపాధ్యక్షులు జావేద్ అలీ, అత్రం పవార్, కోశాధికారి చంద్రశేఖర్, సాంస్కృతిక కార్యదర్శి కుర్సంగె ఉద్ధవ్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ల్యాబ్‌టెక్నీషియన్లకు బయోకెమిస్ట్‌గా ప్రమోషన్



ప్రమోషన్ పొందిన ల్యాబ్ టెక్నీషియన్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ల్యాబ్‌టెక్నీషియన్లుగా పనిచేస్తున్న నలుగురికి బయోకెమిస్ట్‌గా ప్రమోషన్ కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేందర్ కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మందికి ప్రమోషన్ కల్పించగా ఇందులో జిల్లా నుంచి నలుగురున్నారు. దీంతో వీరికి ప్రభుత్వ వైద్యకళాశాలలో గెజిటెడ్ హోదా లభించింది. గిమ్మ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న బండారి కృష్ణను మెదక్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు, తాంసి పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఈ. రమణాచారిని రిమ్స్ వైద్యకళాశాలకు, అంకోలి పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఎంఏ సమీని వరంగల్ జిల్లాలోని నర్సంపేట ప్రభుత్వ వైద్యకళాశాలకు, శ్యామ్‌పూర్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న భూమయ్యను భూపాలపల్లి వైద్యకళాశాలకు కేటాయించారు.

'సాత్నాల' నుంచి నీటి విడుదల



సాత్నాల మండలంలోని సాత్నాల ప్రాజెక్టుకు ఆదివారం 302 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. రెండు గేట్లు ఎత్తి 602 క్యూసెక్కులను దిగువకు వదిలినట్లు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.046 టీఎంసీలున్నట్లు వెల్లడించారు. – సాత్నాల

నిండుకుండలా 'మత్తడివాగు'



జలకళతో మత్తడివాగు ప్రాజెక్ట్

తాంసి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వడ్డాడి సమీపంలోని మత్తడివాగు ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరింది. ప్రాజెక్ట్ అధికారులు ఎప్పటికప్పుడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. వారంరోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టగా ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో తగ్గింది. ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటి మట్టం ఉండగా ప్రాజెక్ట్ నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 277.40 మీటర్ల వద్ద నీరు నిల్వ ఉంది. నిండుకుండలా మారడంతో పలువురు పర్యాటకులు వచ్చి ప్రాజెక్ట్ అందాలను తిలకిస్తున్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఎస్పీఎం కార్మికుడి మృతి


భాస్కర్(ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్: ఎస్పీఎం పేపరు మిల్లులో ఫైబర్ లైన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న ఎన్నం భాస్కర్ (41)పై ఈ నెల 3న కెమికల్ పడడంతో తీవ్ర గాయాలు కాగా వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. 18 రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


తోఫిక్ (ఫైల్)

ఇచ్చోడ: మండలంలోని ముఖ రా(బి) గ్రామంలో శనివారం సాయంత్రం తోఫిక్ (22) అనే యువకుడు అనుమానాస్పదంగా బావిలో పడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. తోఫిక్ అదే గ్రామానికి చెందిన కొంతమంది యువకులతో కలిసి శనివారం సాయంత్రం కామ్లే రాహుల్ వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. కొంతసేపటి తర్వాత స్నేహితులు బావిలో నుంచి పైకి రాగా తోఫిక్ మాత్రం బయటకు రాలేదు. వెంటనే గ్రామస్తులు బావి వద్దకు వెళ్లే సరికి తోఫిక్ బావిలో మృతి చెంది ఉన్నాడు. ఆదివారం ఉదయం పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి శవపంచానామా నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి రఫీక్ ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ వలలో యువకుడు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ చాలా మంది అత్యాశతో ఉన్న డబ్బులు పోగొట్టుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నాడు. రూ.లక్షా650 పోగొట్టుకొని లబోదిబోమంటున్నాడు. ఈనెల 19న ఇన్‌స్టాగామ్‌లో ధని లోన్‌యాప్ లింక్ రాగా బాధితుడు ఓపెన్ చేశాడు. రూ.5లక్షల రుణం తీసుకోవచ్చని,ఇందుకు ప్రాసెసింగ్ ఫీజు రూ.1800 చెల్లించాలని సైబర్ నేరగాళ్లు సూచించారు. నమ్మిన యువకుడు మొదట డబ్బులు చెల్లించాడు. ఆ తర్వాత బీమా పేరిట రూ.5వేలు, ఇలా పలురకాల ఫీజుల పేరిట ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాడు. మొత్తం రూ.లక్షా650 చెల్లించాక మోసపోయినట్లు గ్రహించాడు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా, సీఐ నాగరాజు కేసు నమోదు చేసినట్లు వివరించారు. బాధితులు 1930కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

బ్యాటరీ దొంగలు అరెస్ట్



బ్యాటరీ దొంగలతో ఎస్సై లింబాద్రి

నిర్మల్‌టౌన్: బ్యాటరీ దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై లింబాద్రి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌రూరల్ మండలం అక్కపూర్ గ్రామానికి చెందిన తాండ్ర సాయన్న తన జేసీబీని గ్రామ శివారులో ఉంచి వెళ్లారు. పట్టణంలోని మంజులాపూర్‌కు చెందిన అఖిల్, మహాలక్ష్మివాడకు చెందిన నందకిషోర్‌లు జేసీబీలోని రెండు బ్యాటరీలను శనివారం రాత్రి దొంగిలించారు. విషయం తెలుసుకున్న జేసీబీ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రెండు బ్యాటరీలను రికవరీ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎక్స్‌పైరీ సరుకుల విక్రయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీమార్ట్‌లో గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) సరుకుల విక్రయాలు కలకలం సృష్టించాయి. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం రాత్రి శ్రీమార్ట్ సూపర్‌మార్కెట్‌కు వెళ్లి మిల్కీ మిస్ట్‌లను కొనుగోలు చేశాడు. బిల్లు చెల్లించాక వస్తువులపై ఉన్న ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించగా ఈ నెల 4 గడువుగా ఉండడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై షాపు నిర్వాహకులను ప్రశ్నించగా సిబ్బంది నిర్లక్ష్యంగా అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటాయని, మరోసారి జరుగకుండా చూస్తామని సమాధానం ఇచ్చారు. దీంతో బాధితుడు జిల్లా ఫుడ్ సెఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

యూరియా తరలించేదెలా..?


యూరియా బస్తాలు అన్‌లోడ్ చేస్తున్న రైతులు

వేమనపల్లి: మండలంలోని బమ్మెన, చామనపల్లి గ్రామాలకు చెందిన రైతులు యూరియా తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మార్గమధ్యలోని గొలిమికుంట ఒర్రెపై కల్వర్టు అసంపూర్తిగా నిర్మించారు. యూరియా లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ ట్రాలీ ఒర్రెలో ఆదివారం దిగపడింది. రైతులు బస్తాలను అన్‌లోడ్ చేసి ట్రాలీ బయటకు తీశారు. మళ్లీ లోడ్ చేసుకుని బమ్మెన గ్రామానికి తరలించారు.

శరణు.. శరణు దేవీ!


అమ్మవారి విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు

- నేటి నుంచే శరన్నవరాత్రోత్సవాలు
- మండపాల్లో కొలువుదీరనున్న దుర్గమ్మ
- ఏర్పాట్లు పూర్తి చేసిన భక్తజనం
- 11 రోజులు.. 11 రూపాల్లో దర్శనం

ఆదిలాబాద్: అమ్మవారి ఆగమనానికి సర్వం సిద్ధమైంది. ఆది పరాశక్తిని నవరాత్రుల్లో కొలిచేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేవి శరన్నవరాత్రి వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మవారి మూర్తులు తుదిరూపం దిద్దుకుంటున్నాయి.

శరన్నవరాత్రులు పేరెలా..?

ప్రతీ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు మహార్నవమి వరకు దేవీ నవరాత్రులు లేదా శరన్నవరాత్రులుగా పిలుస్తారు. ఈ మాసం నుంచి వర్ష ఋతువు వెళ్లి, శరత్ ఋతువు ప్రారంభమవుతుంది. దీంతో శరన్నవరాత్రులుగా వ్యవహరిస్తారు. ఈ ఋతువులో వర్షాకాలం ముగిసి చలికాలం ప్రారంభమవుతుంది. ఈ అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు శక్తి ఆరాధన పేరుతో ప్రజలంతా పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి అంటువ్యాధులు దరిచేరవని భక్తుల నమ్మకం.

11 రోజులు.. 11 రూపాలు

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకు ఒక్క రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. మొదటిరోజు ఈనెల 22న బాల త్రిపుర సుందరి దేవిగా, 23న శ్రీ గాయత్రి దేవిగా, 24న శ్రీ అన్నపూర్ణ మాతగా 25న కాత్యాయనీ దేవిగా, 26న శ్రీ మహాలక్ష్మి దేవిగా, 27న శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా, 28న శ్రీ మహా చండీ దేవిగా, 29న సరస్వతి దేవిగా, 30న దుర్గాదేవిగా దర్శనమిస్తారు. అక్టోబర్ 1న మహిషాసుర మర్ధిని దేవి, 2న రాజరాజేశ్వర దేవిగా అమ్మవారు దర్శనమిస్తారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


శ్రీ కన్యకాపరమేశ్వరి శివపంచాయతన దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన టెంట్లు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి శివపంచాయతన క్షేత్రంలో సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. మహాశక్తి రూపిని కన్యాకాపరమేశ్వరి దేవిని భక్తులు నమ్మకంతో కొలుస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

దేవీ శరన్నవరాత్రులకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఒక్కో రోజు ఒక్కో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ ప్రాంగణంలో టెంట్లు, లైటింగ్ ఏర్పాట్లు చేశాం. అందరి సహకారంతో ఏటా అంగరంగ వైభవంగా శరనవరాత్రులను నిర్వహిస్తున్నాం.

– శంకరయ్య, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు

నాటి మహిషాపురం.. నేటి భైంసా పట్టణం..


గుట్టపై వెలిసిన గట్టు మైసమ్మ ఆలయం

భైంసా: ఒకప్పటి మహిషాపురమే నేడు భైంసా పట్టణంగా పిలుస్తున్నారు. చరిత్రను తెలిపే రాతితో చెక్కిన మహిషాపాదాలు భైంసాలో దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఉండే మహిషాసుర రాక్షసుడిని దుర్గాదేవి మహిషా అవతారంలో వధించిందని పురాణాలు చెబుతున్నాయి. సాక్షాత్తు దుర్గాదేవే ప్రజలను ఆదుకున్నందుకు అప్పటి వారు రాతితో పాదాలను చెక్కించారు. ఇందుకు గుర్తుగా సమీపంలోని గుట్టపై మైసమ్మ మందిరాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో దుర్గాదేవి గట్టు మైసమ్మగా పూజలు అందుకుంటోంది. కాగా సోమవారం నుంచి భైంసా డివిజన్‌వ్యాప్తంగా భక్తులు దుర్గాదీక్షలు స్వీకరించనున్నారు.

ఇద్దరమ్మల పుణ్యక్షేత్రం


ఆలయంలో కొలువైన కనకదుర్గాదేవి, మహంకాళి అమ్మవారి విగ్రహాలు

రెబ్బెన: ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూగా వెలిసిన మహంకాళి అమ్మవార్లు భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంలా విరాజిల్లుతున్నారు. రెండో చంద్రపూర్‌గా పేరుగాంచిన ఈ ఆలయంలో నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపనున్నారు.

అంగరంగ వైభవంగా ఉత్సవాలు..



ఆలయంలో అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి చవితి తిథి రెండు రోజుల్లో ఉండటంతో ఉత్సవాలను పది రాత్రుల పాటు నిర్వహిస్తున్నాం.

– దేవార వినోద్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకుడు

అమ్మ కొలువుదీరే వేళాయె..!

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత ఆలయం, హరిహర క్షేత్రం, బంగల్ పేట్ మహాలక్ష్మి, బాగులవాడ ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేకంగా మండపాలను ముస్తాబు చేశారు. మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలు, వివిధ రకాల పువ్వులతో అలంకరించారు.

నాలుగు దశాబ్దాలుగా బాగులవాడలో..

నిర్మల్‌లో నాలుగు దశాబ్దాలుగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బాగులవాడ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో 1981లో మొదటగా దుర్గామాత చిత్రపటం ఉంచి రెండేళ్లు పూజలు చేశారు. తర్వాత 1983లో రెండు ఫీట్ల కర్ర విగ్రహం, 1985 నుంచి ఇప్పటివరకు మట్టి విగ్రహాలు ప్రతిష్టించి చీరలు, ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. బాగులవాడ కాలనీలో సుమారు 500 కుటుంబాల వారు తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలు చేస్తారు.


నందిగుండం దుర్గామాత

ప్రసిద్ధిగాంచిన నందిగుండం దుర్గామాత..

పట్టణంలో 19 ఏళ్ల కిందట నందిగుండం ప్రాంతంలోని మర్రిచెట్టు వద్ద దుర్గామాత వెలిసింది. భక్తులు అప్పటి నుంచి దుర్గామాతకు పూజలు చేస్తున్నారు. గత 14 ఏళ్లుగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆరేళ్ల క్రితం రూ.1.80 కోట్లతో ఆలయం కూడా నిర్మించారు.

అష్టభుజ స్వామికి పదకొండు వాహనాలు..


స్వామి వారు ఊరేగనున్న వాహనాలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని అత్యంత పురాతనమైన అష్టభుజ శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం దక్షిణ భారతదేశంలోనే అష్ట భుజాలు గల ఏకైక ఆలయం. శ్రీ వేణుగోపాలునికి ఎనిమిది చేతులు ఉంటాయి. ప్రతీ చేతిలో ఒక ఆయుధం ఉంటుంది. కత్తి, సుదర్శన చక్రం, విశ్వం, గదా, శంకు, పద్మం, రెండు పిల్లన గ్రోవీలు ఉన్నాయి. నవరాత్రుల్లో భాగంగా ప్రతీరోజు స్వామి వారు గ్రామంలోని రథంపై వివిధ వాహనాలపై ఊరేగుతారు. మొదటి రోజు సూర్య ప్రభ వాహనం, రెండో రోజు చంద్రప్రభ వాహనం, మూడో రోజు గజ వాహనం, నాలుగో రోజు అశ్వ వాహనం, ఐదో రోజు హంస వాహనం, ఆరో రోజు హనుమ వాహనం, ఏడో రోజు శేష వాహనం, ఎనిమిదో రోజు గరుడ వాహనం, తొమ్మిదో రోజు సింహ వాహనం, పదో రోజు పులి వాహనం, పదకొండో రోజు అశ్వం, గరుడ, హనుమ సహిత వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు.

కష్టాలు తొలగిపోతాయి..



శ్రీ వేణుగోపాల స్వామి వద్దకు వచ్చి భక్తితో కొలిచిన భక్తులకు కష్టాలు తొలగిపోయి వారికి అష్టఐశ్వర్యాలు ప్రసాదిస్తాడని ప్రగాఢ నమ్మకం ఉంది. నేటి నుంచి ప్రారంభమయ్యే రథోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారి కృప పొందాలి.

– రవి కిరణ్, ఆలయ కమిటీ చైర్మన్


శ్రీవేణుగోపాల స్వామి ఆలయం

అలరించిన గుస్సాడీ నృత్యం


గుస్సాడీ నృత్యం చేస్తున్న బృందం

బాసర: ఆర్జీయూకేటీలో ఆదివాసీ సంప్రదాయ గుస్సాడీ నృత్య ప్రదర్శన విద్యార్థులు, అధ్యాపకులను ఎంతగానో ఆకట్టుకుంది. స్పిక్ మెకే హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన శ్రీ కనక సుదర్శన్ ఆదివాసీ బృందం ఈ నృత్య ప్రదర్శన చేశారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఆధునిక కాలంలోనూ వారసత్వ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. డిసెంబర్ 2 నుంచి 5 వరకు తెలంగాణ రాష్ట్ర 4వ స్పిక్ మెకే సాంస్కృతిక సమ్మేళనం యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అసోసియేట్ డీన్లు డా. మహేశ్, డా. విఠల్, స్పిక్ మేకే కోఆర్డినేటర్ డా. రాకేశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ

బాసర: ఆర్జీయూకేటీలో నిర్వహిస్తున్న నేషనల్ ఇంజినీర్స్ డే వేడుకలు ఆదివారం ముగిశాయి. 2024 -25 విద్యాసంవత్సరానికి బ్రాంచ్‌ల వారీగా అకాడమిక్ టాపర్లకు మొట్టమొదటి సారిగా ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విద్యార్థులు, అధ్యాపకుల నిబద్ధత, కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ డాక్టర్ ఎస్.విట్టల్, శ్రీ టి.పి.సునీల్ కుమార్, సీవోఈ శ్రీ రామరాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని చేతులపై మోసుకుంటూ..

- వాగు పొంగడంతో అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి
- కుటుంబ సభ్యులే తరలించిన వైనం


మృతదేహాన్ని వాగు దాటిస్తున్న కుటుంబ సభ్యులు

కెరమెరి: వర్షాలకు వాగులు ఉప్పొంగి జిల్లా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. మృతదేహాన్ని అతికష్టం మీద వాగు దాటించిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కరంజీవాడలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మండాడి కోసు(60) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారకస్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఆరోగ్యం విషమించి ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో మృతదేహంతో స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యలోని అనార్‌పల్లి వాగు ఉప్పొంగడంతో అంబులెన్స్ వాగు దాటే అవకాశం లేకపోవడంతో మానవహక్కుల సంఘం జిల్లా చైర్మన్ రమేశ్, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చేతులతో పట్టుకుని వాగుదాటారు. మృతుడికి భార్య రాజుబాయి, కుమారులు మారు, జంగు ఉన్నారు.

గంజాయి మొక్కలు పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

తాంసి: మండలంలోని గిరిగాం గ్రామంలో అక్రమంగా ఇంటి వద్ద పెంచుతున్న గంజాయి మొక్కలను ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన తోడసం గోపాల్ ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడన్న సమాచారం మేరకు సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఇంటి ఆవరణలో పెంచుతున్న రెండు మొక్కలను గుర్తించారు. వీటి విలువ రూ.50 వేలు ఉంటుందని, స్వాధీనం చేసుకొని గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, సిబ్బంది అరవింద్, మోహన్, రవీందర్, శారద, జమీర్, సతీశ్, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ ఉన్నారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన కిరాణా వ్యాపారి తక్కెలపల్లి రాకేశ్ ఇంట్లో చోరీ జరిగింది. ఈనెల 19న కుటుంబ సభ్యులతో కలిసి ఆయన బంధువుల ఇంటికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా, ఇంటికి ఉన్న తాళం పగలగొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు ఆదివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

పండుగల దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

కాగజ్‌నగర్‌టౌన్: దసరా, దీపావళి పండుగల దృష్ట్యా ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున మూడు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైయిన్ నం. 03253 పాట్నా- చర్లపల్లి, సోమ, బుధవారాల్లో, అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు, ట్రైయిన్ నం. 07255 చర్లపల్లి -పాట్నా, వారానికి ఒక్క రోజు (బుధవారం), అక్టోబర్ 3 నుంచి జనవరి 1 వరకు, ట్రైయిన్ నం. 07256 చర్లపల్లి -పాట్నా, శుక్రవారం, అక్టోబర్ 3 నుంచి జనవరి 2 వరకు నడుస్తాయని, ఈ రైళ్లకు కాజీపేట్, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్లలో హాల్టింగ్ ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

భక్తుల పాదయాత్ర


అమ్మవారి వద్ద జ్యోతి వెలిగిస్తున్న భక్తులు

బాసర: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఒక రోజు ముందుగానే మహారాష్ట్రలోని నాందేడ్, పర్బని, ఔరంగాబాద్, నాసిక్ జిల్లాలకు చెందిన భక్తులు పాదయాత్రగా వచ్చి ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఆలయ ముఖ్య అర్చకులు బాలకృష్ణ చేతుల మీదుగా అఖండజ్యోతిని వెలిగించుకుని బాసర నుంచి మహారాష్ట్రకు పాదయాత్రగా తరలివెళ్లారు. గత కొన్నేళ్లుగా జ్యోతితో పాదయాత్ర చేయడం ఆనవాయితీగా వస్తోందని భక్తుడు గణేశ్ తెలిపారు.

స్నూకర్ కేంద్రాలపై పోలీసుల దాడి

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న స్నూకర్ కేంద్రాలపై ఆదివారం రాత్రి ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మానిక్‌రావ్, రాజన్నలు నిర్వహిస్తున్న స్నూకర్ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి స్నూకర్ బాల్స్, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా స్నూకర్ కేంద్రాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గర్భిణి ఆత్మహత్యాయత్నం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన ఓ గర్భిణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆదివారం సాయంత్రం గాజులవేణి శ్రావణి అనే గర్భిణి ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా కుటుంబ సభ్యులు హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్రావణి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉందని తాళ్లగురిజాల ఎస్సై రామకృష్ణ తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు


అరెస్ట్ చూపుతున్న సీఐ సంజయ్

రెబ్బెన: కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా భర్త గొడ్డలితో నరికి చంపిన ఘటన మండలంలోని నారాయణపూర్‌లో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో సీఐ సంజయ్ కేసు వివరాలు వెల్లడించారు. నారాయణపూర్‌కు చెందిన గజ్జల తిరుపతి టాటా ఏస్ వాహనం డ్రైవర్‌గా పని చేసేవాడు. అతనికి చిన్నబుదెకు చెందిన స్రవంతి(38)తో 21 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన తిరుపతి తరుచూ భార్యతో గొడవపడేవాడు. అందులో భాగంగానే భార్యను ఎలాగైనా వదిలించుకోవాలని శనివారం తెల్లవారుజామున ఇంటి పనుల్లో నిమగ్నమైన స్రవంతిని గొడ్డలితో నరికి చంపి పరారయ్యాడు. మృతురాలి తమ్ముడు సంజయ్ అందించిన సమాచారం మేరకు ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ సంజయ్, ఎస్సై వెంకటకృష్ణలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీం ద్వారా శాస్త్రీయకోణంలో దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. భార్యను నరికి చంపి పోలీసులకు దొరకకుండా పారిపోవడానికి శనివారం రాత్రి రెబ్బెన రైల్వేస్టేషన్‌కు రాగా తిరుపతిని పట్టుకుని విచారించినట్లు సీఐ తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే భార్యను నరికి చంపినట్లు అంగీకరించాడని, ఆదివారం జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్సై వెంకట్‌కృష్ణ, సిబ్బంది సందీప్, దుర్గేందర్, ఎస్. శ్రీనివాస్, మహేశ్‌లు ఉన్నారు.

పిడుగుపాటుతో మహిళ మృతి


నిర్మల (ఫైల్)

సాత్నాల: భోరజ్ మండలంలోని పెండల్‌వాడ గ్రా మంలో ఆదివారం పిడుగు పడి నాగుల నిర్మల (33) అనే మహిళ మృత్యువాత పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం చేనుకు వెళ్లి పనులు ముగించుకుని సాయంత్రం తిరిగివస్తున్న సమయంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త సంతోష్ ఉన్నాడు.

బండరేవు తండాలో ఆవు..

సారంగపూర్: మండలంలోని పొట్య గ్రామపంచాయతీ పరిధిలోని బండరేవు తండాలో పిడుగు పడి ఒక ఆవు మృతి చెందింది. బాధిత రైతు ఆడె క్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఎప్పటిలాగే పశువులను మేతకు సమీప అటవీ ప్రాంతానికి తరలించాడు. అయితే ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పిడుగు పడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన ఆవు విలువ సుమారు రూ.48వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బూరుగుపల్లి (జి) తండాలో ఎద్దు..

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి) తండా గ్రామంలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. బూరుగుపల్లి (జి) తండా గ్రామానికి చెందిన జాదవ్ రవీందర్, జాదవ్ రాందాస్ అనే ఇద్దరు అన్నదమ్ములు పొలానికి వెళ్లి ఎడ్లబండిపై తిరిగి వస్తుండగా పిడుగుపాటుకు గురై ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని వారు తెలిపారు. ఘటనలో రాందా స్ అనే వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి ని లకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


మృతిచెందిన ఆవు

గంగాపూర్ శివారులో గేదె..

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు అదే గ్రామానికి చెందిన యాదగిరి శ్రీశైలంకు చెందిన గేదె మృతువాత పడింది. బాధితుడి కథనం ప్రకారం రోజు మాదిరిగానే యాదగిరి శ్రీశైలంకు సంబంధించిన బర్ల మంద గ్రామ శివారులో ఉన్న సమ్మక్కసారలమ్మ గద్దెల సమీపంలో మేత కోసం వెళ్లగా సాయంత్రం ఒక్కసారిగా పిడుగుపడి గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

దొంగల బీభత్సం..!


శారదా బేకరీని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్

బాసర: బాసరలో దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం అర్ధరాత్రి పట్టణంలోని ఓ బేకరీతో పాటు రెండిళ్లలో దొంగతనం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బాసర బస్టాండ్ వద్ద ఉన్న శారదా బేకరీలో శనివారం అర్ధరాత్రి దొంగలు పడి షట్టర్ తాళాలు పగులగొట్టారు. లోపలికి చొరబడి నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం యజమాని దశరథ్ దుకాణం తీసేందుకు రాగా తాళం పగలగొట్టినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుకాణంలోని సీసీ కెమెరా, డీవీఆర్‌ను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. పట్టణంలోని శారదనగర్, వెంకటేశ్వర కాలనీల్లోని రెండిళ్లలో తాళం వేసిన ఇండ్లలో చొరబడి విలువైన వస్తువులను, నగదు ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడిన వారిని పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.